సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం : 26 : జనవరి : 2024

అంతరించిపోతున్న ఆ కళకు అతడే చివరి వారసుడు. బుర్రవీణను భుజాన మోస్తూ.. రామాయణం, ఆధ్యాత్మిక, గ్రామీణ కథలకు తగ్గట్లు వాయిద్యం వాయిస్తూ.. పాటలు పాడుతూ అబ్బురపరుస్తున్నాడు. మృదువైన సంగీతం, బుర్రవీణ వాయిస్తూ.. లయబద్ధంగా పాట పాడుతుంటే చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా మైమరచిపోవాల్సిందే. ఊర్లో జనం సేద తీరేవేళ.. వెన్నెల వాకిట్లో కురిసిన బుర్ర గానం.. ఇప్పుడు పాలమూరు పల్లె నుంచి ఢిల్లీకి తాకింది. ప్రాచీన సంగీత వాయిద్యం 'బుర్రవీణ' కళాకారుడు దాసరి కొండప్పకు పద్మశ్రీ అవార్డు వరించింది. కళారంగంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించనుంది.

- నారాయణపేట/దామరగిద్ద

'బుర్ర'రాగం.. పద్మగానం

దామరగిద్ద బుర్రవీణ వాయిద్యకారుడు దాసరి కొండప్పను వరించిన 'పద్మశ్రీ'



బుర్రవీణ వాయిస్తూ గానం చేస్తున్న దాసరి కొండప్ప

- కళారంగంలో ఆయన సేవలకు నాలుగో అత్యున్నత పౌరపురస్కారం
- గల్లీ నుంచి ఢిల్లీకి ఎదిగిన 'బుర్రవీణ' వాయిద్యం
- 2022లో రాష్ట్ర స్థాయి అవార్డు.. 'బలగం' సినిమాలోనూ కొండప్ప గానం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉమ్మడి జిల్లా కళాకారులు

రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం దాసరి కొండప్పది. తన పూర్వీకుల మాదిరిగానే బుర్ర వీణతో పాటలు పాడుతూ కథలు చెబుతూ జీవనం సాగించేవాడు. వాయిద్యం, పాట మాత్రమే తెలిసిన అతడిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది. నారాయణపేట జిల్లా దామరగిద్దకి చెందిన ఒలియ దాసరి కుటుంబీకుడైన దాసరి ఎంకప్పకు ఇద్దరు కుమారులు కాగా.. రెండో కుమారుడు కొండప్ప. తన తండ్రి, అన్నల నుంచి వారసత్వంగా బుర్రవీణ వాయిద్యంపై పట్టు సాధించాడు. తాతల కాలం నుంచే బుర్రవీణ వాయిద్యంతో భిక్షాటన చేస్తూ తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా తిరుమలరావు అనే వ్యక్తి ద్వారా ఆంధ్ర ప్రాంతంలో పాటలు పాడి తన కళకు గుర్తింపు సంపాదించారు. 2022లోనూ గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయిలో పురస్కారాన్ని అందుకున్నారు.

> బుర్రవీణ.. ప్రత్యేకమైన తంత్ర వాయిద్యం. తెలంగాణ రాష్ట్రంలో త్వరలో అంతరించిపోయేలా ఉన్న దీన్ని వాయించగల చివరి సంగీత విద్వాంసుడు దాసరి కొండప్ప మాత్రమే. తన పూర్వీకుల మాదిరిగానే కొండప్ప కూడా బుర్రవీణతో పాటలు పాడుతూ కథలు చెబుతూ దశాబ్దాలుగా ఈ కళను నమ్ముకొని జీవిస్తున్నాడు. బుర్ర వీణ.. భూమి వీణ.. గిరిజనుల విల్లాడి వద్యాలు.. విల్లు తీగతో వాయించే వాయిద్యానికి సంబంధించినది. ఇది అనేక తంతి వాయిద్యాల సమ్మేళనం. కొండప్ప బుర్రవీణ, చిన్న చిన్న జలదరింపు గంటలతో 24 శబ్దాలను వినిపించగలడు. తన వాయిద్యాన్ని ఎండిన పొట్లకాయ.. కర్ర.. మూడు తీగలతో సొంతంగా తనే తయారు చేసుకుంటాడు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'పద్మ శ్రీ' పురస్కారం ప్రకటించడం ఆ అ'సామాన్య'కళాకారుడిని బతికించడమే కాదు.. ఆ పురాతన కళకు పునఃప్రతిష్ట చేసినట్లు అయింది.



కుటుంబసభ్యులతో పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్ప

'బలగం'లో కొండప్ప గానం

గతేడాది విడుదలైన బలగం చిత్రంలోని 'అయ్యో శివుడా ఏమాయే ఎనకటి దానికి సరిపోయే' అనే పాటకు తన గాత్రాన్ని అందించాడు కొండప్ప. ఇప్పటికీ తన సంగీతం, పాటలను సామాజిక మాద్యమాల ద్వారా అందిస్తూ వస్తున్నాడు. జానపద పాటలతో రామాయణం మహాభారతం, ఇతిహాస కథలను వినిపిస్తూ వస్తున్నాడు. కొండప్ప కళా పటిమకు పద్మశ్రీ వరించడంతో దామరగిద్దతో పాటు ఉమ్మడి జిల్లావాసులు, కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండప్పకు అభినందల వెల్లువ

దాసరి కొండప్పకు పద్మశ్రీ అవార్డు వరించిందని తెలుసుకున్న దామరగిద్ద వాసులు అభినందిస్తున్నారు. గ్రామ మాజీ సర్పంచ్, మాజీ రైతు బంధు జిల్లా సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్ తదితరులు కొండప్ప ఇంటికి వెళ్లి అభినందించారు. పద్మశ్రీ రావడం దామరగిద్దకి దక్కిన అరుదైన గౌరవం అంటూ కొనియాడారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సైతం కొండప్పకు 'ఎక్స్' (ట్విట్టర్)లో ప్రత్యేక అభినందనలు తెలిపారు. సామాజిక-ఆధ్యాత్మిక తత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.. వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు.

న్యూస్‌రీల్

ఓటుతోనే నవసమాజ నిర్మాణం

- అదనపు కలెక్టర్ కుమార్ దీపక్



నాగర్‌కర్నూల్: ఓటుతోనే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. భారత ఎన్నికల వ్యవస్థాపక, 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాలను గురువారం ఐడీఓసీ ప్రజావాణి సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించడంతో పాటు ఎన్నికల సంఘం రూపొందించిన మై భారత్ హోం పాటను ప్రదర్శించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటుహక్కు పొందేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ కె.సీతారామారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటుకున్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. 18ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు నాగర్‌కర్నూల్ ఆర్డీఓ రాంరెడ్డి ఆధ్వర్యంలో క్రీడా మైదానం నుంచి ప్రభుత్వ జర్నల్ ఆస్పత్రి వరకు విద్యార్థులచే ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ నర్సింగ్‌రావు, డీపీఓ కృష్ణ, జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ జాకీర్ అలీ, డీటీ రఘు పాల్గొన్నారు.

ప్రగతి ప్రణాళికలు

15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై గ్రామసభలు



అచ్చంపేట మండలం సిద్ధాపూర్ గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

- ప్రాధాన్యత క్రమంలో పనుల గుర్తింపు
- గ్రామస్వరాజ్ వెబ్‌సైట్‌లో నమోదు
- ఇప్పటికే ఎంపీడీఓలు, ఎంపీఓలకు శిక్షణ

అచ్చంపేట: 2024–25 సంవత్సరం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించి అధికారులు అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. అందులో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పనుల ప్రాధాన్యతను గుర్తించేందుకు సభలు నిర్వహిస్తున్నారు. పనుల సమాచార సేకరణ నిమిత్తం ఈనెల 17నుంచి 19 వరకు ప్రాథమిక గ్రామసభలు నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకుగాను గురువారం గ్రామసభలను ప్రారంభించారు. 27వ తేదీ వరకు సభలు నిర్వహించి, గుర్తించిన పనులను 30వ తేదీలోగా గ్రామస్వరాజ్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. అందుకు సంబంధించి ఈనెల 14నుంచి 16 వరకు ఎంపీడీఓలు, ఎంపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ) కోసం పల్లెల్లో సమావేశాలు ప్రారంభమయ్యాయి. మెజార్టీ ప్రజల ఆమోదం మేరకు పనులను గుర్తించనున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, పరిశుభ్రత, సుపరిపాలన, బాలబాలికల సంరక్షణ, మహిళా సాధికారిత, తాగు నీటి వసతితో పాటు ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీ కుటుంబానికి 100 రోజుల పని కల్పించడం, పెండింగ్ కూలి డబ్బుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటారు.

16వ తేదీలోగా జెడ్పీ సమావేశం

జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (డీపీడీపీ) నోడల్ అధికారిగా జెడ్పీ సీఈఓ వ్యవహరిస్తారు. ఫిబ్రవరి 16వ తేదీలోగా జెడ్పీ సమావేశం నిర్వహించి, ఆమోదించిన పనులను ఫిబ్రవరి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో అంశాలపై చర్చిస్తారు. ఉన్న నిధులతో పాటు అదనంగా మరో 10 శాతం నిధులను కోరుతూ 15వ ఆర్థిక సంఘం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిసింది. ఇవి మంజూరైతే ప్రజల సమక్షంలో ప్రాధాన్యత ప్రకారం గుర్తించిన పనులను చేపడతారు.

ఫిబ్రవరి 10 వరకు మండల స్థాయిలో..

మండల స్థాయిలో బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (బీపీడీపీ) నోడల్ అధికారిగా ఎంపీడీఓలు వ్యవహరిస్తారు. వాటి అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేసి.. అందులో అన్ని శాఖల అధికారులను భాగస్వాములను చేస్తారు. ఫిబ్రవరి 7వ తేదీ నాటికి మండల సర్వసభ సమావేశం ఏర్పాటుచేసి, గుర్తించిన పనులను ఆమోదిస్తారు. 10వ తేదీలోగా గ్రామస్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అభివృద్ధి పనుల్లో భాగంగా మండల కేంద్రాల నుంచి గ్రామాలకు అనుసంధానించే రోడ్లు, మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తారు.

గ్రామ సభలు నిర్వహిస్తున్నాం



> గ్రామాల్లో ప్రాథమిక సమాచార సేకరణ పూర్తయ్యింది. గురువారం నుంచి 27వ తేదీ వరకు గ్రామాల్లో సభలను ఏర్పాటు చేస్తున్నాం. పనుల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, వారి ఆమోదం మేరకు అభివృద్ధి ప్రణాళికలు తయారుచేస్తాం. గుర్తించిన పనుల వివరాలను 30వ తేదీలోగా గ్రామస్వరాజ్ వెబ్‌సైట్‌లో నమోదుచేస్తాం.
>
> – వెంకటయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి, అచ్చంపేట

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



గణతంత్ర దినోత్సవానికి ముస్తాబైన పోలీసు పరేడ్ మైదానం

- పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- జాతీయ పతాకం ఆవిష్కరించనున్న కలెక్టర్

కందనూలు: గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానాన్ని ముస్తాబు చేశారు. సంప్రదాయ సిద్ధంగా పోలీసు కవాతు నిర్వహించడానికి ఇప్పటికే రిహార్సల్స్ నిర్వహించారు. ప్రభుత్వ శాఖల అభివృద్ధికి సంబంధించిన శకటాల ప్రదర్శనతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ జాతీయ పతాకం ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో చేపట్టిన అభివృద్ధి, ఆయా శాఖల ప్రగతి నివేదికను కలెక్టర్ చదివి వినిపించనున్నారు. వేడుకల్లో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించడంతో పాటు విద్యార్థినీ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆయా శాఖలలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా బాంబు స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు చేపట్టారు. పరేడ్ మైదానంలో ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించనున్నారు. అదేవిధంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

నేటి కార్యక్రమాలు ఇలా..

- ఉదయం 9గంటలకు కలెక్టర్ ఉదయ్‌కుమార్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకం ఆవిష్కంచి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు.
- 9:10 గంటలకు సంప్రదాయసిద్ధ పోలీసు కవాతు
- 9:20 గంటలకు జిల్లా ప్రగతి నివేదికను కలెక్టర్ చదివి వినిపిస్తారు.
- 9:50 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం
- 10 గంటలకు బాలబాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు
- 10:30 గంటలకు ప్రభుత్వ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన,
- 10:45 గంటలకు స్టాల్స్ సందర్శన
- 11 గంటలకు ఉత్తమ ఉద్యోగులకు కలెక్టర్, ఎస్పీ చేతులమీదుగా ప్రశంసా పత్రాల ప్రదానం
- 11:30 గంటలకు జాతీయ గీతాలపనతో కార్యక్రమం ముగుస్తుంది.



నారాయణపేట జిల్లా కోస్గి మండలం దుక్కాల్‌కి చెందిన రైతు కృష్ణ.. తాను పండించిన వంద బస్తాల వేరుశనగను అమ్మేందుకు మంగళవారం సాయంత్రం బాదేపల్లి మార్కెట్‌కు తీసుకొచ్చాడు. బుధవారం టెండర్‌లో తన పల్లికి రూ.7,099 ధర వచ్చింది. అయితే యార్డులో సరైన గిట్టుబాటు ధర రాలేదని రైతులు ఆందోళన చేపట్టారు. అయితే గురువారం రీటెండర్లు వేస్తామని యార్డు అధికారులు తెలపడంతో అధిక ధర వస్తుందని ఆశపడి పడిగాపులు కాశారు. రీటెండర్‌లో కేవలం రూ.6,999 ధరను కేటాయించారు. అంటే ముందురోజు కంటే రూ.100 తగ్గింది. పడిగాపులు కాసిన పాపానికి ధర తగ్గడంతో గత్యంతరం లేక వచ్చిన తక్కువ ధరకే అమ్ముకొని వెళ్లిపోయాడు.

...ఈ పరిస్థితి ఒక్క కృష్ణదే కాదు.. బాదేపల్లి మార్కెట్‌లో గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్న రైతులందరిదీ.

పల్లి రైతు విలవిల



బాదేపల్లి యార్డుకు విక్రయానికి వచ్చిన వేరుశనగ

- మరింత పడిపోయిన వేరుశనగ ధర
- మూడు రోజులుగా యార్డులో పడిగాపులు
- రీటెండర్‌లో రూ.100కు పైగా ధర తగ్గింపు
- గత్యంతరం లేక వచ్చిన ధరకే అమ్ముకుంటున్న రైతాంగం

జడ్చర్ల: గిట్టుబాటు ధర కోసం రెండు రోజులుగా ఆందోళన చేసినా.. మార్కెట్‌లోనే కుప్పల వద్ద పడిగాపులు పడినా నిరాశే మిగిలింది. ఇక విధిలేక తెచ్చిన పంటను వెనక్కి తీసుకెళ్లడమో.. లేదా అయినకాడికి అమ్ముకోవాల్సిన దీనస్థితి బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో కనిపిస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని రైతులు అష్టకష్టాలు పడి పండించిన వేరుశనగ పంటను అమ్ముకునేందుకు బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. అయితే బుధవారం మార్కెట్‌లో వేరుశనగకు ధర భారీగా పడిపోవడంతో రైతులు ఒక్కసారిగా ఆందోళన బాటపట్టారు. అయితే మార్కెట్ యార్డు అధికారులు, వ్యాపారులు చర్చించి రూ.5 వేలకు తక్కువగా వచ్చిన రైతులకు మాత్రమే కేవలం రూ.200 పెంచి కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో ఆపై ధరలు వచ్చిన వారు నిరాశకు గురయ్యారు. గురువారం రీటెండర్‌లో ఎక్కువ ధరలు వస్తాయని ఆశించిన రైతులకు మళ్లీ నిరాశే మిగిలింది. రీటెండర్‌లో సైతం బుధవారం నాటి ధరకు మరింతగా తగ్గడంతో విధిలేక అమ్ముకోవాల్సిన వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని బాధిత రైతులు వాపోయారు.

కిక్కిరిసిన మార్కెట్‌యార్డు..

వివిధ ప్రాంతాలనుండి పంట దిగుబడులు భారీగా రావడంతో యార్డు ఆవరణ కిక్కిరిసిపోయింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కోస్గి, కొడంగల్, వికారాబాద్ ప్రాంతాల నుంచి రైతులు వేరుశనగ పంటను విక్రయించేందుకు మంగళవారం రాత్రి వరకు బాదేపల్లి యార్డుకు వచ్చారు. బుధవారం ధరలు గిట్టుబాటు కాకపోవడం, ఆందోళన చేయడంతో విక్రయాలు నిలిచిపోయాయి. గురువారం కూడా ధరలు దక్కలేదు. దాదాపు 3 వేల క్వింటాళ్లకు పైగా వేరుశనగ విక్రయానికి రాగా.. మిగతా పంట ఉత్పత్తులు సైతం భారీగా రావడంతో మార్కెట్ యార్డు నిండిపోయింది. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సెలవు ఉండడంతో పాటు మరో రెండు రోజులు పడిగాపులుకాయలేక వచ్చినకాడికి అమ్ముకున్నట్లు రైతులు తెలిపారు. ఈ కారణంగానే వ్యాపారులు కూడా ధరలను తగ్గించి మరింత నిలువు దోపిడీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మరింత పడిపోయిన ధర..

మార్కెట్‌లో బుధవారం వేరుశనగకు క్వింటాల్ గరిష్టంగా రూ.7,155, కనిష్టంగా రూ.4,929, సగటున రూ.6489 ధరలు లభించాయి. గురువారం గరిష్టంగా రూ.7,079, కనిష్టంగా రూ.4,929, సగటున రూ.6,385 ధరలు లభించాయి. అంటే క్వింటాల్‌కు రూ.100కు పైగా ధర తగ్గింది. ఆందోళన చేస్తే ధరలు పెరగాలే కానీ తగ్గడం ఏమిటని రైతులు విచారం వ్యక్తం చేశారు. తమ సమస్యలపై అటు అధికారులు, ఇటు పాలకులు స్పందించకపోవడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన చేసినా ధరలు రాలేదు..



> మార్కెట్‌లో కుప్పల వద్ద నిద్రపోలేక, పడిగాపులు కాయలేక ధర తక్కువ వచ్చినా అమ్మక తప్పడం లేదు. ఇప్పటికే ఇల్లు విడిచి మూడు రోజులు అయింది. గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేసినా ధరలు రాలేదు. వ్యాపారులు ధరలు తక్కువ వేసి అయినకాడికి దోచుకున్నారు. 50 బస్తాల వేరుశనగను యార్డుకు తీసుకురాగా రూ.6,660 ధర దక్కింది.
>
> – బి.రాములు, అల్లిఖాన్‌పల్లి, కొడంగల్

తక్కువ ధర వస్తుందనుకోలేదు..



> ఆరుగాలం అష్టకష్టాలు పడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, తదితర పెట్టుబడులకు భారీగా ఖర్చు చేశాం. తీరా పంటను అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్న చందంగా మారింది. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలి.150 బస్తాల వేరుశనగను యార్డుకు తీసుకురాగా రూ.6,659 ధర లభించింది. ఇంత తక్కువ ధర వస్తుందను కోలేదు.
>
> – శ్రీనివాస్, మాదారం

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి



గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తెలకపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. తెలకపల్లి మండలం రాంరెడ్డిపల్లిలో ఆర్‌జీఎస్‌ఏ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం ఎంపీ నిధులు రూ.20 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుమిత్ర, ఎంపీపీ కొమ్ము మధు, సర్పంచ్ లావణ్య, సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ యాదయ్యతో పాటు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

నాగర్‌కర్నూల్: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. ఎవరైనా పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తిమ్మాజిపేట, తాడూర్ మండలాల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే కథానాయకులని, కార్యకర్తల కృషితోనే పార్టీ బలంగా ఉందన్నారు. కేసీఆర్‌పై ప్రజల్లో సానుభూతి వెల్లువలా ఉందని.. ఈ పరిస్థితిని పార్లమెంట్ ఎన్నికల్లో సానుకూలంగా మలచుకోవాలని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని.. పార్టీకి, ప్రభుత్వానికి సమన్వయం లేకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఎదురైందన్నారు. అభూత కల్పనలు, అబద్దాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. ప్రతిపక్ష హోదాలో మాట్లాడటం ఇంకా మొదలుపెట్టలేదని, అప్పుడే కాంగ్రెస్ వాళ్లు ఉలిక్కిపడుతున్నారన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఇంకెలా ఉంటుందో ఊహించుకోవాలని అన్నారు. హామీల అమలు విషయంలో కాంగ్రెస్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉదాసీన వైఖరి, మీమాంస వీడాలని సూచించారు. సమావేశంలో బైకాని శ్రీనివాస్‌యాదవ్, నాగం శశిధర్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

క్లుప్తంగా

చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య

గోపాల్‌పేట: చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని కొత్తబండరావిపాకుల సమీపంలో గురువారం తెల్లవారుజామున వెలుగు చూసింది. రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా వెన్నచెర్లకి చెందిన చెట్ల నిరంజన్ కుమారుడు లక్ష్మయ్య, కల్వకోలుకి చెందిన సుభద్రకు సుమారు 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కాగా ఐదేళ్ల క్రితం మద్యం ఎక్కువగా తాగుతున్నాడని, ఇంట్లో గొడవ పడుతున్నాడని సుభద్ర..లక్ష్మయ్యను వదిలేసి పిల్లలను తీసుకుని కల్వకోలుకి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అతడు వెన్నచెర్లలో ఉంటున్నాడు. అప్పుడప్పుడూ బండరావిపాకులలో ఉండే తన తమ్ముడు స్వామి దగ్గరకు వచ్చి వెళ్తుండేవాడు. కాగా ఆరు నెలల క్రితం తమ్ముడి దగ్గరకు వచ్చి అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం బయటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి ఎక్కడికో వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం గ్రామ సమీపంలోని గుట్టల్లో చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడని అటువైపు వెళ్లినవారు పోలీసులు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి చూసి కుటుంబ సభ్యులను పిలిపించగా మృతదేహం లక్ష్మయ్యదేనని గుర్తించారు. అతడి భార్య సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వివరించారు.

చింతకుంటలో యువకుడు..

పాన్‌గల్: ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణు కథనం ప్రకారం.. చింతకుంటకి చెందిన కుమ్మరి శ్రీకాంత్(22) హైదరాబాదులో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా హైదరాబాదు నుంచి బుధవారం రాత్రి నేరుగా స్వగ్రామానికి వచ్చి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో జరిగిన ప్రమాదంతో మతిస్థిమితం సక్రమంగా ఉండక పోవడంతో ఉరివేసుకొని ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు. శ్రీకాంత్ తండ్రి శాంతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

బిజినేపల్లి: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఒకరి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తిమ్మాజిపేట మండలం మారేపల్లి గ్రామానికి చెందిన కురువ నారాయణ (60) ద్విచక్ర వాహనంపై తిమ్మాజిపేటకు వెళ్తున్నాడు. గుమ్మకొండ గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆర్టీసీ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

రైలు కింద పడి..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం దాదాపుగా 50 సంవత్సరాలు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి చనిపోయాడని పేర్కొన్నారు. పాయింట్, షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని గద్వాల మార్చురీకి తరలించామని తెలిపారు. వివరాల కోసం సెల్: 8309067184 సంప్రదించాలని కోరారు.

పాన్‌గల్ ఎంపీపీపై హత్యాయత్నం

- దళితబంధు రాలేదన్న అక్కసుతో దాడి
- ఒంటిపై డీజిల్ పోసి నిప్పంటించేందుకు యత్నించిన దుండగులు
- నిందితులను కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్ శ్రేణుల రాస్తారోకో



పాన్‌గల్‌లో ఎంపీపీపై దాడిని నిరసిస్తూ రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాన్‌గల్: వనపర్తి జిల్లా పాన్‌గల్ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డిపై బుధవారం రాత్రి హత్యాయత్నం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. పాన్‌గల్‌లోని పెద్దమ్మగుడి సమీపంలో స్థానికులతో ఎంపీపీ మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆది శ్రీను, ఆది స్వామి అక్కడికి చేరుకుని ఆయనతో వాగ్వాదానికి దిగారు. దళితబంధు రాకపోవడానికి తానే కారణమని దుర్భాషలాడటంతో పాటు వెంట తెచ్చుకున్న డీజిల్ ఎంపీపీపైపోసి నిప్పంటించేందుకు యత్నించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న కొందరు అడ్డుకోగా.. వారిపై సైతం దాడికి పాల్పడినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు గురువారం పాన్‌గల్‌కు పెద్దఎత్తున చేరుకుని పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ మాట్లాడుతూ కొందరి ప్రోత్సాహంతో ఎంపీపీ హత్యకు యత్నించినట్లు తెలిపారు. ఎంపీపీ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా.. ఇద్దరిని స్టేషన్‌కు పిలిపించి వెంటనే వదిలివేశారన్నారు. దీంతో సదరు వ్యక్తులు ఎంపీపీతో పాటు ఆయన తల్లిదండ్రిని అసభ్య పదజాలంతో దూషిస్తూ.. మరో సారి దాడిచేసేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తనను ఎలాగైనా చంపుతామని.. గతంలో రెండు సార్లు తప్పించుకున్నావంటూ దూషించినట్లు ఎంపీపీ తెలిపారు.

❒ బీఆర్‌ఎస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌నాయక్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ఇటువంటి దాడులు ఎన్నడూ జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే దాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. నిందితులపై కేసు నమోదు చేసి.. ఎఫ్‌ఐఆర్ కాపీ ఇచ్చేవరకు రాస్తారోకో విరమించేది లేదని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న వనపర్తి సీఐ మహేశ్వరరావు, ఎస్‌ఐలు యుగంధర్‌రెడ్డి, నాగన్న, వేణు బీఆర్‌ఎస్ నాయకులకు నచ్చజెప్పేందుకు యత్నించగా.. వాగ్వాదానికి దిగారు. నిందితులపై కేసు నమోదు చేసి, ఎఫ్‌ఐఆర్ కాపీ ఇస్తామని సీఐ హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

దాడి అమానుషం: మాజీ ఎమ్మెల్యే భీరం



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్తలు హత్యకు యత్నించడం అమానుషమని మాజీ ఎమ్మెల్యే భీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు అన్నారు. పాన్‌గల్‌లో ఎంపీపీని పరామర్శించి, దాడి వివరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవ చేసే వ్యక్తిపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా భావించాలన్నారు. దాడి ఘటనపై స్థానిక ఎస్‌ఐ వ్యవహరించిన తీరు బాగాలేదన్నారు. ఉన్నతాధికారులు ఆదేశించే వరకు స్థానిక పోలీసులు స్పందించకపోవడం దారుణమన్నారు. కోర్టు కేసులు, సివిల్ పంచాయితీల్లో పోలీసులు జోక్యం చేసుకుంటూ ప్రతిపక్ష పార్టీ నాయకులను భయపట్టే విధంగా వ్యవహరించడం తగదన్నారు. ఎంపీపీకి రక్షణ కల్పించాలని కోరారు. ఈ విషయంపై రాష్ట్ర పార్టీ నాయకత్వాన్ని ఆశ్రయించి, డీజీపీని కలుస్తామన్నారు. ఎంపీపీని పరామర్శించిన వారిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ వెంకటయ్యనాయుడు ఉన్నారు.

నిందితులపై కేసు నమోదు..

ఎంపీపీపై దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించిన ఆది శ్రీను, ఆది స్వామిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. ఎంపీపీపై దాడి ఘటనకు సంబంధించి వెంటనే స్పందించి, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి పక్షపాతం, నిర్లక్ష్యం చూపలేదని ఎస్‌ఐ తెలిపారు.

పసికందు కిడ్నాప్‌కు యత్నం

- తల్లి ప్రతిఘటించడంతో పరారీ
- జడ్చర్లలో కలకలం



మణిదీప్

జడ్చర్ల: ఇంట్లో ఊయలలో పడుకోబెట్టిన మూడు నెలల పసికందును కిడ్నాప్ చేసేందుకు ఇద్దరు వ్యక్తులు యత్నించిన ఘటన జడ్చర్లలో కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. జడ్చర్ల పట్టణంలోని తాలూకా క్లబ్ రోడ్డులోని విద్యానగర్ కాలనీలో రవీందర్‌గౌడ్ – కవిత దంపతులు నివాసముంటున్నారు. వీరికి మణిదీప్ (మూడు నెలలు) బాబు ఉన్నాడు. గురువారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంట్లోని ఊయలలో పడుకోబెట్టిన బాబును గుర్తు తెలియని వ్యక్తి తీసుకోగా.. ఆ పక్కనే ఉన్న తల్లి కవిత గమనించి నిలదీసింది. బాబును ఎందుకు తీసుకుంటున్నావు అని ప్రశ్నించగా, బాబుకు జ్వరం వచ్చిందంట.. మీ భర్త ఆస్పత్రికి తీసుకురమ్మన్నాడని సదరు వ్యక్తి సమాధానం ఇచ్చాడు. అసలు బాబుకు జ్వరమే రాలేదు.. తన భర్త ఎందుకు తీసుకురమ్మన్నాడంటూ అనుమానం వ్యక్తం చేస్తూ తన బిడ్డను తీసుకునేందుకు ప్రయత్నించగా, అతడు ఇవ్వలేదు. దీంతో గట్టిగా కేకలు వేస్తూ అతడిపై ఎదురుదాడి చేయడంతో బాబును విడిచిపెట్టి బయటికి పరిగెత్తాడు. అప్పటికే మరో వ్యక్తి స్కూటీని స్టార్ట్ చేసి సిద్ధంగా ఉంచగా.. దానిపై పరారయ్యాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చుట్టుపక్కల ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి, చిన్నారి కిడ్నాప్‌కు ప్రయత్నించిన వారిని గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. బాబు తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

ఐదేళ్ల చిన్నారిపై 17 ఏళ్ల బాలుడి లైంగికదాడి

- చాక్లెట్ల ఆశ చూపి అఘాయిత్యం
- వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో చోటుచేసుకున్న ఘటన



ఆత్మకూర్: అభం శుభం తెలియని ఓ ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్ల ఆశ చూపి 17ఏళ్ల బాలుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ కేఎస్ రత్నం, ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలిలా.. ఆత్మకూర్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన భార్యభర్తలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఐదేళ్ల కూతురు ఉండగా.. ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. చిన్నారి ప్రతి రోజు ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులు ముగించుకొని కొంత ఆలస్యంగా ఇంటికి చేరుకునేవారు. అప్పటి వరకు చిన్నారి ఒంటరిగా ఇంట్లో ఉండేది. ఇదే విషయాన్ని గమనించిన ఇంటికి సమీపంలో ఉండే 17ఏళ్ల బాలుడు సదరు చిన్నారి వద్దకు వెళ్లి చాక్లెట్ల ఆశ చూపి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. అయితే, బుధవారం రాత్రి చిన్నారి తీవ్రనొప్పితో రక్తస్రావం కావడంతో గమనించిన తల్లి ఏమైందని ఆరా తీసింది. ఇంటి పక్కన ఉండే అన్న ఇలా చేశాడని చెప్పడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. వెంటనే ఇందుకు కారకుడైన బాలుడి ఇంటికి చేరుకొని అతని కుటుంబసభ్యులను నిలదీశారు. అయితే, తమ కుమారుడికి ఏమి తెలియదని, అతని ప్రమేయం ఏం లేదంటూ చిన్నారి తల్లిదండ్రులపైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి న్యాయం చేయాలంటూ చిన్నారి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. బుధవారం రాత్రి 11 గంటలకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి.. గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చికిత్స, వైద్య పరీక్షల నిమిత్తం చిన్నారిని ఆస్పత్రిలో చేర్పించామని, నిందితుడిని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి

- ఉస్మానియాలో చికిత్స పొందుతూ మృతి
- 14 రోజుల తరువాత వెలుగు చూసిన ఘటన



సేవ్యానాయక్(ఫైల్)

బల్మూర్: వంట చెరుకు విషయంలో ఘర్షణ పడి అన్నపై తమ్ముడు దాడి చేయగా బాధితుడు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని నర్సాయపల్లికి చెందిన ముడావత్ సేవ్యానాయక్(60), హతీరాంలు అన్నదమ్ములు. వీరికి ఎలాంటి పాతకక్షలు లేవు. కానీ ఈనెల 11న రాత్రి వంట చెరుకు విషయంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో హతీరాం అన్న తలపై కర్రతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి పడి పోయాడు. వెంటనే కుటుంబసభ్యులు అతన్ని అచ్చంపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ 14 రోజుల తరువాత పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందాడు. అతని కుమారుడు ముడావత్ హరికృష్ణ గురువారం బల్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అచ్చంపేట సీఐ అనుదీప్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి మృతదేహానికి ఉస్మానియాలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. సేవ్యానాయక్‌కు భార్య సోనా, కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ మరో వ్యక్తి..



మల్లేష్‌గౌడ్(ఫైల్)

మిడ్జిల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని వెల్‌జాల్ రోడ్డుపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం, చౌదర్‌పల్లికి చెందిన మల్లేష్‌గౌడ్(40) తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అతడి భార్య చామంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని వివరించారు. కాగా మల్లేష్‌కు భార్యతోపాటు ఇద్దరు పిలల్లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

ప్రాణస్నేహితుడిని మరవలేక బలవన్మరణం



విష్ణు (ఫైల్)

ఉండవెల్లి: ప్రాణస్నేహితుడిని మరవలేక ఓ విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉండవెల్లి మండలంలో గురువారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ వివరాల మేరకు.. పుల్లూరుకు చెందిన బోయ లక్ష్మి, అయ్యన్నలకు కుమారుడు విష్ణు (17) ఉండవెల్లిలో ఐటీఐ రెండో సంవత్సరం చదవుతున్నాడు. గతేడాది ఆగస్టులో విష్ణు ప్రాణ స్నేహితుడు రమేష్ రైలు కిందపడి మృతిచెందాడు. ఈ ఘటనతో మానసికంగా వేదనకు గురైన విష్ణు.. రమేష్ పేరును టాటో వేయించుకున్నాడు. మొబైల్‌లో రోజు రమేష్ స్టేటస్‌లు పెడుతూ జ్ఞాపకం తెచ్చుకునేవాడు. ఈ క్రమంలో రమేష్ మృతిచెందిన చోటికి విష్ణు వెళ్లి తన స్నేహితుడు నాగరాజుకు ఫోన్‌చేసి, తాను చనిపోతున్నట్లు చెప్పాడు. అనంతరం గుర్తు తెలియని రైలు కిందపడి మృతిచెందాడు. ఘటనా స్థలంలో తల్లిదండ్రుల రోధన మిన్నంటింది. బాధిత కుటుంబ సభ్యులను అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు పరామర్శించారు.

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్

స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్ల టౌన్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని నాంపల్లి ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. జిల్లాకేంద్రంతో పాటు జడ్చర్లలో గురువారం పదోతరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు ఉన్నతవిద్యలో రాణించాలని కోరారు. లక్ష్యాలను నిర్దేశించుకొని దాని సాధన కోసం నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు చేయూతను ఇవ్వాలన్న ఉద్దేశంతో తమ పార్టీ ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు కొన్నేళ్ల నుంచి మోడల్ పేపర్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా ఇన్‌చార్జి జాబెర్‌బిన్ సయీద్, జిల్లా అధ్యక్షుడు ఎంఏ హాదీ, కోఆర్డినేటర్ జాబిర్ బిన్ సయీద్, మల్లేపల్లి కార్పొరేటర్ జఫర్‌ఖాన్, నాయకులు ఎండీ జాకీర్ అడ్వకేట్, సాదతుల్లా హుస్సేని, ముస్తాక్ రశీద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ ఉచ్చులో ప్రైవేట్ ఉద్యోగి

కొత్తకోట రూరల్: సైబర్ నేరగాళ్ల చేతిలో ఓ ప్రైవేట్ ఉద్యోగి దారుణంగా మోసపోయాడు. ఏకంగా రూ.2.55 లక్షలు పోగొట్టుకున్నాడు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన తెలగారెడ్డి నరేష్‌కుమార్ కొత్తకోట పట్టణంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ అడ్డాకుల సమీపంలో గల సోలార్ ప్లాంట్‌లో ఎలక్ట్రికల ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఓ రోజు అనుకోకుండా ఇతడి ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ చేసి మీరు ఇంటి దగ్గరే ఉంటూ "Easy part time job" అని ఫోన్ చేశాడు. హోటల్‌కు రేటింగ్ ఇవ్వడం ద్వారా రోజు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు సంపాదించొచ్చని మెసేజ్ కూడా వచ్చింది. అందుకు నరేష్‌కుమార్ స్పందిస్తూ వారి డెమో ప్రకారం గుగూల్‌లో హోటల్‌కు రేటింగ్ ఇచ్చాడు. దానికి గానూ వారు నరేష్‌కుమార్‌కు గుగూల్‌పే ద్వారా రూ.150 పంపించారు. తర్వాత నరేష్‌కుమార్ వాట్సాప్ నంబర్‌కు వారి టెలిగ్రామ్ లింక్ వచ్చింది. అందులో పెట్టిన డబ్బులు రెట్టింపు అవుతాయని మెసేజ్ చేశారు. అందుకు నరేష్‌కుమార్ స్పందిస్తూ జనవరి 19న రూ.2వేలు ఇన్వెస్ట్ చేయగా సైబర్ నేరగాళ్లు రూ.2,800 ఇచ్చారు. అదే రోజు రూ.65వేలు, 20న రూ.1.80లక్షలు, 21న రూ.లక్ష ఇలా మొత్తం రూ.3.45లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. అయితే తన ఖాతాలో డబ్బులు డ్రా కాలేదు. పైగా రూ.1.74లక్షలు కమర్షియల్ ట్యాక్స్ చెల్లిస్తే మొత్తం డబ్బులు డ్రా చేసుకోవచ్చని సైబర్ నేరగాళ్లు మభ్యపెట్టడంతో తను మోసపోయానని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు.

రెండు షాపుల్లో చోరీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో గురువారం రెండు షాపుల్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది ఏఎస్‌ఐ రామస్వామి వివరాల ప్రకారం.. పెబ్బేటి సాయిరామ్‌కు చెందిన సాయి ఎలక్ట్రికల్ షాపు, సూరారెడ్డికి చెందిన పర్టిలేజర్ షాపులలో గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఎలక్ట్రికల్ షాపు యజమాని పెబ్బేటి సాయిరాం బుధవారం రాత్రి 9 గంటలకు షాపు మూసి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం 9 గంటలకు షాపు తెరవడానికి రాగా, షెటర్ తాళాలు పలిగి కనిపించాయి. అనుమానంతో షెటర్ తెరిచి చూడగా అందులో ఉన్న నగదు రూ.99 వేలు దొంగిలించినట్లు గుర్తించాడు. సూరారెడ్డికి సంబంధించిన పర్టిలేజర్ షాపులో కూడా చోరీకి పాల్పడడంతో కొంత నగదు పోయినట్లు పేర్కొన్నాడు. పెబ్బేటి సాయిరాం ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రామస్వామి తెలపారు.

నేడు ఆల్ ట్రేడ్ యూనియన్స్ నిరసన

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో కార్మికులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి పిలుపునిచ్చారు. ఆల్‌ట్రేడ్ యూనియన్స్ సమావేశం గురువారం జిల్లా సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. మతోన్మాద, నయా ఉదారవాద విచ్ఛిన్నకార విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ నెల 28న జిల్లా సదస్సు, ఫిబ్రవరి 1నుంచి 5 వరకు రైతులు, వ్యవసాయ కూలీల దగ్గరకు వెళ్లి బీజేపీ అనుసరిస్తున్న విధానాలను తెలియజెప్పాలని సూచించారు. సమ్మె నోటీసులు అందజేసి ఫిబ్రవరి 16న బంద్ చేపట్టాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, ధన్వాద రాములు, గాలెన్న ఉన్నారు.

రేషన్ దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

కోస్గి: పట్టణంలోని రేషన్ దుకాణాల్లో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. 1వ నంబర్ రేషన్ దుకాణంలో నిల్వలను తనిఖీ చేయగా 74.38 క్వింటాళ్లు తక్కువ రావడంతో డీలర్ చంటి క్రిష్ణను, 2వ దుకాణంలో 74.58 క్వింటాళ్లు తక్కువ రావడంతో డీలర్ ఎం.కిష్టయ్యను సస్పెండ్ చేశారు. సంబంధిత డీలర్ల దుకాణాలను సమీప డీలర్లుగా ఉన్న హన్మంతు, శాంతి బాయిలను ఇన్‌చార్జిలుగా నియమించి దుకాణాలను అప్పగించినట్లు ఆయన తెలిపారు. రేషన్ బియ్యం నిల్వలో భారీగా తేడాలు రావడంతో ఇద్దరు డీలర్లపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

క్లుప్తంగా

సెమీస్‌కు చేరిన బళ్లారి, మన్నెవారిపల్లి



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న సీవీకే ఆల్ ఇండియా లెవల్ టీ–20 క్రికెట్ టోర్నీ రసవత్తరంగా కొనసాగుతోంది. ఐదో రోజు గురువారం గ్రూప్‌–ఏ నుంచి డెక్కన్ క్రికెట్ అకాడమీపై 5 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకున్న మ్యాక్స్ క్రికెట్ క్లబ్ బళ్లారి.. గ్రూప్‌–బీ నుండి వైభవ్ గైక్వాడ్ ఐపీఎస్ ఎలెవన్ జట్టుపై 152 పరుగుల భారీ తేడాతో గెలిచిన మన్నెవారిపల్లి సీసీ సెమీ ఫైనల్‌కు చేరాయి. గ్రూప్‌–బీ నుంచి ఉదయం సెషన్‌లో వైభవ్ గైక్వాడ్ ఐపీఎస్ ఎలెవన్ వర్సెస్ మన్నెవారిపల్లి సీసీ తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మన్నెవారిపల్లి సీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. 227 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన వైభవ్ గైక్వాడ్ ఐపీఎస్ ఎలెవన్ జట్టు.. 12 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. దీంతో మన్నెవారిపల్లి సీసీ 152 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. మధ్యాహ్నం సెషన్‌లో గ్రూప్‌–ఏ నుంచి డెక్కన్ క్రికెట్ అకాడమీ వర్సెస్ మ్యాక్స్ క్రికెట్ క్లబ్ బళ్లారి తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న డీసీఏ 19.5 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటయ్యింది. 136 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన బళ్లారి.. 12.5 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. దీంతో డీసీఏపై 5 వికెట్ల తేడాతో బళ్లారి విజయం సాధించింది.

దివ్యాంగులకు పింఛన్ హామీని అమలు చేయాలి



మహబూబ్‌నగర్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ హామీని వచ్చే నెల నుంచి అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మధుబాబు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. 2016 దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు ప్రకారం అంత్యోదయ రేషన్‌కార్డు మంజూరు చేయాలని పేర్కొన్నారు. చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాలకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్‌పీఆర్‌డీ సభ్యత్వ రశీదులను అందజేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశప్ప, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.బాలపీర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రభుస్వామి, నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షుడు పి.బాబు, కృష్ణ, నాయకులు మొగులయ్య, భానుప్రకాష్, నరేందర్, రఫీక్, మహేష్, కృష్ణయ్యగౌడ్, ఆంజనేయులు, అలువేల, శారదమ్మ, బేగం పాల్గొన్నారు.

హైందవ సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యం



నవాబుపేట: హైందవ సంస్కృతి, సంప్రదాయాలను మరింత పెంపొందించడమే లక్ష్యంగా ఏకల్ ఫౌండేషన్ పని చేస్తోందని ఫౌండేషన్ దక్షిణ భారత ప్రాంతాల ప్రముఖ్ ఖద్దార్‌జీ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏకల్ ఫౌండేషన్ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవే మార్గంగా కొనసాగుతున్న ఏకల్ విద్యతో చాలామంది స్వయం ఉపాధి పొందుతున్నారని వివరించారు. శిక్షణలో గ్రామీణ యువతకు కంప్యూటర్ విద్య, మహిళలకు కుట్లు, అల్లికలతో ఉపాధి కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. సంప్రదాయాలు పాటిస్తూ హైందవ శక్తిని అందరికి వివరించాలని, చిన్నారులు హిందూ సంప్రదాయాలు, సాంస్కృతి అలవర్చుకునేలా అవగాహన కల్పించి మంచి వాతావరణంలో పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు పోల్కంపల్లి చంద్రశేఖర్, కార్యదర్శి బచ్చు రామకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఇందిరాదేవి, ప్రేమఖ్ సుధాకర్‌జీ, కోట్లరాజు తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాల అభివృద్ధికి అడుగులు

- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న దేవాదాయశాఖ ఈఈ, డీఈ
- గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశీలన



ఆలయ ఆవరణలో ఈవో, ఈఈ, డీఈ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదలను సిద్ధం చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం సంబంధితశాఖ ఈఈ కనకదుర్గప్రసాద్, డీఈ వేమూరి శ్రీనివాసశర్మ ఆలయాలను సందర్శించారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ గత నెల 17న సీఎం రేవంత్‌రెడ్డిని తన నివాసంలో కలిసి ఆలయాల అభివృద్ధికి చొరవ చూపాలని కోరుతూ పలు సూచనలతో నివేదికను అందజేశారు. ఇందుకు స్పందించిన సీఎం రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు గురువారం కర్నూలు సమీపంలోని కల్లూరి శివారు సర్వేనంబర్346/1, 346/3లో ఉన్న 15.30 ఎకరాల ఆలయ భూమిని పరిశీలించారు. అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు కల్యాణ మండపం, కమర్షియల్ గోదాం నిర్మాణానికి వినియోగించవచ్చని నిర్ధారణకు వచ్చారు. ఈ భూమికి రహదారి కోసం సర్వే చేయించాలని, ముందుగా ప్రహరీ ఏర్పాటు చేయాలని ఈఓ పురేందర్‌కుమార్‌ను ఈఈ ఆదేశించారు. అలాగే రూ.కోటితో మాంటిస్సోరి పాఠశాల సమీపంలో రోడ్డుపై ఆర్చి నిర్మించేందుకు స్థల పరిశీలన చేసి కొలతలు తీసుకున్నారు. ఈ పనులు త్వరగా ప్రారంభించేందుకు కమిషనర్ నుంచి ఇప్పటికే ఆదేశాలు వచ్చాయి. అలాగే పాత ఆస్పత్రి భవనంలోని ముళ్లపొదలను తొలగించి ఆ స్థలంలో భోజనశాల, ఈఓ, చైర్మన్ కార్యాలయం, భక్తులకు డార్మెటరీ, అధునాతన సదుపాయాలతో మీటింగ్ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. ఇందుకోసం దాతలు, ఆలయ నిధులతో పనులు ప్రారంభించేందుకు పలు సూచనలు చేశారు.

ఆలయంలో మార్పులు..

అమ్మవారి ఆలయంలో ఇనుప బారికేడ్లను తొలగించి వాటిస్థానంలో స్టీల్ బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఆలయ ఆవరణలోని ఎర్రరాతి ఫ్లోరింగ్‌ను తొలగించి బెంగుళూరు స్టోన్‌తో వేసేందుకు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. అలాగే గర్భాలయం గోడలకు అతికించిన గ్రానెట్ ఊడిపోయేందుకు సిద్ధంగా ఉండటం, ఫ్లోరింగ్ దెబ్బతినడంతో మరమ్మతులకు పలు సూచనలు చేశారు. వారి వెంట చైర్మన్ చిన్నకృష్ణయ్య, జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మయ్య ఆచారి, ధర్మకర్తలు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.



పాత ఆస్పత్రి భవనం వద్ద కొలతలు తీసుకుంటున్న అధికారులు

కమనీయం.. ఆదిశిలావాసుడి కల్యాణం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం కనులపండువగా జరిగింది. వేదపండితులు భీంసేనాచారి, మధుసూదనాచారి, నాగరాజుశర్మ, రవిచారి స్వామివారి ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా హోమం, కల్యాణం వేదమంత్రోచ్చారణల నడుమ జరిపించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం ముగిసిన తర్వాత భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, అరవిందరావు, బాబురావు చంద్రశేఖర్‌రావు, దీరేంద్రదాసు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసుడి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఉమామహేశ్వరంలో హైదరాబాద్ మేయర్..



ఆలయంలో పూజలు చేస్తున్న హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి

అచ్చంపేట రూరల్: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో గురువారం హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు, పూజారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో గణపతిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, శివుడికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్రను ఈఓ వివరించి శేషవస్త్రంతో సత్కరించారు. అక్కడి నుంచి శ్రీశైలం వెళ్లారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు వీరయ్యశాస్త్రి, సిబ్బంది రామకృష్ణ, లక్ష్మయ్య, సతీష్, కవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో సినీనటుడు నవదీప్



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను గురువారం సినీనటుడు నవదీప్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బాల బ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అర్చకులు వారికి క్షేత్ర ప్రాశస్త్యం వివరించి తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ఈవో అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



పీయూ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వం అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను కేటాయించడాన్ని నిరసిస్తూ పాలమూరు యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు అర్జున్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థి సంఘాలపై పోలీసుల ప్రవర్తనను ఖండిస్తున్నామని, ప్రభుత్వం వెంటనే భూములను ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్రంలో అనేక వ్యవసాయ ఆవిష్కరణలు జరిగాయని, యూనివర్సిటీకి సంబంధించిన భూములు ఇతర అవసరాల కోసం కేటాయిస్తే దాని భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. నాయకులు కృష్ణ, జైపాల్, శిరీష, మనీషా, వేణుగోపాల్ పాల్గొన్నారు.

తెలంగాణ శకట ప్రదర్శనకు ఎంపిక

పీపనగండ్ల: ఢిల్లీలో శుక్రవారం నిర్వహించనున్న గణతంత్ర్య దినోత్సవంలో తెలంగాణ శకట ప్రదర్శనకు వనపర్తి జిల్లా పీపనగండ్ల మండలం తూంకుంటకు చెందిన డప్పు కళాకారిణి బోరెల్లి జ్యోతి ఎంపికయ్యారు. శకట ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన కళాకారిణిగా పేరుపొందిన జ్యోతి.. తెలంగాణ రాష్ట్రం తరఫున ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలిపారు. చిన్న నాటి నుంచి డప్పు కళాకారుణిగా రాణిస్తూ పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో జానపదంలో ఎంఏ పూర్తి చేసిందని కుటుంబ సభ్యులు తెలిపారు.



బోరెల్లి జ్యోతి

డబుల్ బెడ్రూంలకు తాళం వేసిన అధికారులు

రాజాపూర్: మండలంలో చొక్కంపేట్ గ్రామంలో 32 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. ఈ క్రమంలో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పాలసీ మారి అధికారులు మారారు. గురువారం చొక్కంపేట్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్లను అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావ్, తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, హౌసింగ్ ఈఈ, ఏఈలు పరిశీలించి వాటికి తాళాలు వేయించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం నాసిరకంగా ఉండడంతో వర్షా కాలంలో వర్షానికి పైకప్పులో నీరు నిలిచి కుంటలా మారాయి. అప్పట్లో 'సాక్షి'తో పాటు కొన్ని దినపత్రికల్లో కథనాలు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు లబ్ధిదారులకు ఇళ్ల ఇచ్చే అవకాశం లేదని అధికారులు చెప్పడంతో నిరాశే మిగిలిందని ఆశావహులు పేర్కొంటున్నారు.



చొక్కంపేట్ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లకు తాళం వేయిస్తున్న అధికారులు

'డబుల్' ఇళ్ల విచారణతో దడ

- ఆందోళనలో దళారులు
- అనర్హుల నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక బృందాలు
- కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర విచారణ
- వారం రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక



క్రిష్టియన్‌పల్లి శివారులో డబుల్ ఇళ్ల కేటాయింపుపై విచారణ నిర్వహిస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్‌బెడ్‌ రూం ఇళ్ల పథకంలో జరిగిన అక్రమాలు నిగ్గు తేల్చేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. పట్టణంలోని క్రిష్టియన్‌పల్లి, వీరన్నపేట, దివిటిపల్లిలో ఇళ్లు నిర్మించగా.. ఎక్కువ శాతం అనర్హులకు కేటాయించడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. క్రిష్టియన్‌పల్లి శివారు ఆదర్శనగర్‌లో ఇళ్లు కేటాయించి ఏడేళ్లు గడుస్తున్నా నేటికీ పట్టాలు రాకపోవడం గమనార్హం. క్రిష్టియన్‌పల్లి బాధితులతో పాటు మరికొంత మంది ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి, కలెక్టర్ రవినాయక్‌కు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. గత పాలకుల హయాంలో చాలావరకు ఇళ్లు దళారుల పాలయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. . అధికార బలంతో అప్పటి పాలకులు కొందరు రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ఇళ్లను అమ్ముకున్నారనేది బహిరంగ రహస్యమే. పాలకుల అండదండలతో కొంతమంది స్థానిక నాయకులు ఇష్టం వచ్చినట్లు డబుల్ ఇళ్ల పథకాన్ని ఏటీఎంగా మార్చుకున్నారు. ఇప్పుడు విచారణ ప్రారంభం కావడంతో దళారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. జిల్లా కలెక్టర్ రవినాయక్‌కు స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సైతం ఫిర్యాదు చేయడంతో అధికారులు సమగ్ర విచారణకు పూనుకొన్నారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ 18 బృందాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసి విచారణ చేయిస్తున్నారు. రెండు రోజుల నుంచి విచారణ వేగం పుంజుకుంది. స్థానికంగా ఇళ్లలో ఉంటున్న వారు నిజమైన అర్హులా..? లేక బినామీలా..? అనే విషయం తేలే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే గత పాలకుల తప్పిదాలలో భాగస్వాములైన అధికారులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. అప్పుడు కాదనలేక తలలు ఊపి సంతకాలు చేసి ఇప్పుడు తర్జన భర్జన పడుతున్నారు. వారం రోజుల్లో విచారణ పూర్తి చేసి తనకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ రవినాయక్.. అదనపు కలెక్టర్ మోహన్‌రావు, హౌజింగ్ పీడీ భాస్కరయ్యలకు ఆదేశాలు జారీ చేశారు. మరోపక్క క్రిష్టియన్‌పల్లిలో నిజమైన అర్హులు తమకు కేటాయించిన ఇండ్లల్లో నివాసం ఉంటున్నప్పటికీనీ ఏళ్ల తరబడి వారికి పట్టాలు ఇవ్వకుండా మాజీ ప్రజాప్రతినిధి అనుసరించిన వైఖరిపై స్థానికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పేదలను ఆదుకోవాల్సిన సదరు ప్రజాప్రతినిధి రాజకీయ కోణంలో ప్రభుత్వ పథకానికి ఉద్దేశ పూర్వకంగా కొర్రీ పెట్టారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదిఏమైనా గత పాలకులతో అంటకాగిన అధికారులు, నేతలు, దళారులు ఇప్పుడు దిక్కులు చూస్తున్నారు.

28న పాలమూరుకు అమిత్ షా

- రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో పార్లమెంట్ క్లస్టర్ సమావేశం
- ఏర్పాట్లు పరిశీలించిన ఏపీ జితేందర్‌రెడ్డి



బీజేపీ నేతలతో చర్చిస్తున్న ఏపీ జితేందర్‌రెడ్డి

పాలమూరు: వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే బీజేపీ నియోజకవర్గాల్లో అంతర్గతంగా పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పార్టీ అగ్రనేతలు సైతం జిల్లాకు రాబోతున్నారు. ప్రధానంగా ఈసారి బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. ఈ క్రమంలోనే ఈనెల 28న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే పార్లమెంట్ క్లస్టర్ సమావేశానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈనెల 28న మధ్యాహ్నం 12 గంటల నుంచి 2గంటల వరకు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు సంబంధించి పార్లమెంట్ కమిటీ విభాగాల నేతలతో సమీక్ష నిర్వహించనున్నారు. పట్టణంలోని రాజ బహదూర్ రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను గురువారం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ పరిశీలించారు. సమావేశం నిర్వహించే హాల్‌తో పాటు హెలిప్యాడ్ కోసం సిద్ధం చేయనున్న పాలిటెక్నిక్ కళాశాల మైదాన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ జితేందర్‌రెడ్డి సమావేశం నిర్వహణపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. బందోబస్తు ఏర్పాట్లపై రూరల్ సీఐ స్వామితో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

- మన్యంకొండలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



అలంకరణలో స్వామి దంపతులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతినెల పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో స్వామి దంపతులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం జీలకర్ర, బెల్లం పెట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజన సందోహంతో కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి దంపతులను పల్లకీలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పలు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, అర్చకులు పాల్గొన్నారు.



మన్యంకొండలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

సీఎం రేవంత్‌రెడ్డితో చల్లా వంశీచంద్‌రెడ్డి భేటీ



సీఎంతో సమావేశమైన చల్లా వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డితో గురువారం హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి భేటీ అయ్యారు. జిల్లాలో అభివృద్ధిపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, అనుమతులపై చర్చించారు. సీఎంగా, పాలమూరు బిడ్డగా జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిసింది. ప్రత్యేకంగా జిల్లాలో సాగునీరు, ఉద్యోగ, ఉపాధి కల్పన, మెరుగైన విద్య, ఆరోగ్య వసతుల కల్పనపై, రైల్వేలైన్లు, బ్రిడ్జిల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు.

1,557 కి.మీ. బైక్ ప్రయాణం

- రాములోరి దర్శనం కోసం అమరచింత నుంచి అయోధ్య ప్రయాణం



అయోధ్య నుంచి అమరచింతకు బయలుదేరుతున్న యువకులు

అమరచింత: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన ఐదుగురు భక్తులు మోటార్ బైక్‌లపై ప్రయాణం చేసి రామయ్యను దర్శించుకున్నారు. శ్రీరాముడిని దర్శనం కోసం పట్టణానికి చెందిన సాక రమేష్, తెలుగు పరుశురాం, కంకరి వినోద్, కంకరి చిన్న, తోకలి భీమరాజ్ ఈనెల 20న మూడు మోటార్ బైక్‌లపై అయోధ్యకు ప్రయణమయ్యారు. మొదటి రోజు 457 కిలోమీటర్లు, రెండోరోజు 547 కిలోమీటర్లు, మూడవ రోజు 553 కిలో మీటర్ల మేర ప్రయాణం చేసి రాములవారిని దర్శించుకున్నారు. దర్శన అనంతరం అమరచింతకు తిరుగు ప్రయాణం చేస్తున్నామన్నారు.

ఆకుపై మహాత్మాగాంధీ చిత్రం

కల్వకుర్తిరూరల్: పట్టణానికి చెందిన విద్యార్థి యశ్వంత్ కుమార్ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జాతిపిత మహాత్మాగాంధీ చిత్రాన్ని ఆకుపై గీసి ఆకట్టుకున్నారు. మహాత్మా గాంధీ నూలు వడుకుతున్న విధంగా చిత్రాన్ని గీయడంతో పాటు ఇండియా గేట్, జాతీయ జెండాను వేసి అందరి మన్ననలు పొందారు.



పీయూలో సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. 2 గంటల పాటు పీయూ అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎక్కడా లేనివిధంగా పీయూలో సాధారణ ఫీజులతో పాటు స్పెషల్ ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. ఐడీ కార్డులు, ఇన్సూరెన్స్, స్పోర్ట్స్ తదితర వాటికి వసూలు చేస్తుండగా.. అందులో ఏ ఒక్కటి కూడా విద్యార్థుల కోసం ఖర్చు చేయడం లేదని తెలిపారు. స్కాలర్‌షిప్ మంజూరైన విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. బాలికల హాస్టల్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలన్నారు. వసతిగృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డిమాండ్ చేశారు. కిరాణా సరకులు నాణ్యతగా ఉండాలని తెలిపారు. ఇంజినీరింగ్, లా కళాశాలలను ఏర్పాటుచేసి, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పరిధిలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం రిజిస్ట్రార్ గిరిజ, వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఆయా సంఘాల నాయకులు రాము, మహేష్, మారుతి, రూప్‌సింగ్, భరత్, మీసాల గణేష్, రమేష్, శ్రీను, నవీన్, గోపాల్ పాల్గొన్నారు.